క్లుప్తంగా

నేడు పుల్లంపేటకు జిల్లా కలెక్టర్ రాక

పుల్లంపేట : అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ నేడు శుక్రవారం పుల్లంపేటకు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరుకానున్నట్లు పుల్లంపేట తహసీల్దార్ నరసింహ కుమార్ తెలిపారు. కావున మండలవ్యాప్తంగా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఈటమాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు పెనగలూరు మండల డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. ఈటమాపురం పంచాయతీలోని ప్రజలు కార్యక్రమానికి విచ్చేసి స్పెషలిస్ట్ వైద్యుల ద్వారా వైద్య సేవలు పొందాలని సూచించారు.

నేడు రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం (నేడు) జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరవుతారని గురువారం ఉప సర్పంచ్ తోట శివ సాయి చెప్పారు. ప్రజలను దృష్టిలో పెట్టుకుని వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్నమాచార్య ఫార్మసీ కళాశాలకు 'న్యాక్ ఏ' గుర్తింపు

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు రావడం ప్రశంసనీయమని అన్నమాచార్య కళాశాలల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. గురువారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో జరిగిన సభలో చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిచే జ్ఞాపిక, ధృవీకరణ పత్రం రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో ఫార్మసీకి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం



ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆర్యవైశ్యులు

రైల్వేకోడూరు : ఈ నెల 15వ తేదీ నుంచి జరగబోయే శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, పార్థసారధి, మేడా వెంకటసుబ్బయ్య, లక్ష్మినారాయణ, శరత్, హరినాథ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు

గాలివీడు : సంబేపల్లె మండల పరిధిలోని ప్రసిద్ధి చెందిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి దసరా ఉత్సవాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని మండల ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, ఎంపీడీఓ శేఖర్‌నాయక్‌లు కోరారు. గురువారం మండలంలోని కొర్లకుంట గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులతో కలిసి నల్లగంగమ్మ తల్లి దసరా ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

రాయచోటి టౌన్ : అగ్రి ఆర్మీ, దీపా బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రాయచోటి పట్టణానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి రక్తదానం చేశారు. గురువారం పీలేరు పట్టణానికి చెందిన కృష్ణవేణి అనే గర్భిణీ రక్తం అవసరం ఉండడంతో వెంటనే బాధితులు అగ్రి ఆర్మీ, దీపా బ్లడ్ బ్యాంక్ వారిని సంప్రదించారు. స్పందించిన ట్రస్ట్ సభ్యులు వెంటనే విష్ణువర్ధన్‌రెడ్డి ద్వారా రక్తదానం చేయించారు. కార్యక్రమంలో అగ్రి ఆర్మీ అధ్యక్షుడు బిందురెడ్డి, అనిల్, నాగార్జున నాయుడులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా.. జగనన్న ఆరోగ్య సురక్ష



సంబేపల్లె మండలం దుద్యాల గ్రామంలో..



ఓబులవారిపల్లె : మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



ఒంటిమిట్ట : వైద్య పరీక్షలకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రజలు

ఓబులవారిపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ప్రతి పేదవారి ఆరోగ్యానికి భరోసా ఇస్తూ జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం గోవిందంపల్లి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవారికి వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న మదిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపకల్పన చేశారన్నారు. అనంతరం వైద్యులు రోగులకు అందిస్తున్న సేవలు రోగులను అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహారం, చిరుధాన్యాల స్టాల్స్‌ను, కంటి వైద్య పరీక్షలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ రమేష్ రాజు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, వైద్యాధికారులు దేవేంద్రరెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లె (రాయచోటిటౌన్) : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గురువారం వీరబల్లె మండలం ఓదివీడు గ్రామంలో ఆ గ్రామ సచివాలయ సముదాయలలో నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు తమ తమ ఆరోగ్య సమస్యలపై వైద్యాధికారుల వద్ద వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకరమ్మ, గోపినాథరెడ్డి, రామజయచంద్ర, ఎంపీటీసీ శ్రీదేవి, మాజీ సర్పంచ్ మహబూబ్ బాషా, మాజీ ఎంపీటీసీ అన్సర్ బాషా, బీసీ నాయకుడు మోడెం నాగభూషణం, మండల సచివాలయ కో–ఆర్డినేటర్ ముకుందపురం నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరామరాజు, శివరామ్, షామీర్ బాషా, సురేంద్ర రాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలందరికీ వరంలాంటిదని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జ్యోతి గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. దీర్ఘకాలిక వ్యాధుల సమస్యలతో బాధపడుతున్న రోగులు రిమ్స్ నుంచి వచ్చిన వైద్య నిపుణులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారన్నారు. శిబిరంలో 233 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అలాగే 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. కార్యాక్రమంలో సర్పంచ్ సుబ్బమ్మ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రవిశేఖర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, ఎంపీడీఓ జవహర్‌బాబు, తహసీల్దారు లక్ష్మీదేవి, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, వీఆర్‌ఓ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : జగనన్న సురక్షతోనే ప్రజల ఆరోగ్యం సాధ్యమవుతుందని రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనందరెడ్డి, నాయకుడు బసిరెడ్డిలు అన్నారు. మండలంలోని దుద్యాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం డ్వామా పీడీ మద్దిలేటి పర్యవేక్షణలో నిర్వహించారు. శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామంలోని రోగులు, వృద్ధులు, పిల్లలు, గర్భిణులు వైద్యులతో చికిత్స చేయించుకొన్నారు. అనంతరం వారికి అధికారులు, నాయకులు మందులను అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, ఆంజనేయులు, ఎంపీడీఓ నరసింహులు, వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాలివీడు : జగనన్న ఆరోగ్య సురక్షతోనే రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తోందని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీలు యదుభూషన్‌రెడ్డి, గాలి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కొర్లకుంట, తలముడిపి గ్రామాలకు సంబంధించిన ప్రజలకు కొర్లకుంట గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలు వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతమ్మ, భానుమూర్తిరెడ్డి, ఎంపీడీఓ శేఖర్‌నాయక్, వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనగలూరు : ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు అన్నారు. గురువారం ఓబిలి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే వచ్చి వైద్య బృందం సేవలు చేయడం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. శిబిరంలో అన్ని రకాల రోగులకు వైద్య సేవలు అందించి, మందులను పంపిణీ చేశారు. పలువురిని ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో డీటీ మురళీకృష్ణ, సర్పంచ్ బాషా, ఎంపీటీసీ బాషా, సర్పంచ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలకు వరమని మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బండపల్లి గ్రామం వెంకట్‌రెడ్డిగారిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రాధన్యత గురించి ప్రజలకు వివరించారు. ఒక పైసా ఖర్చు లేకుండా కోరిన వైద్యశాలలో చికిత్స చేయించుకొనేలా ప్రభుత్వం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌కుమార్, ఎస్ఐ కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట (సిద్దవటం) : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఒంటిమిట్ట మండలంలోని పెన్నపేరూరు గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. కార్యక్రమానికి చుట్టపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వారికి వైద్యులు వైద్యపరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో గజ్జల శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మినారాయణరెడ్డి, దిబ్బయ్య, ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్, తహసీల్దారు మాధవీలత, ఇన్‌చార్జి ఎంపీడీఓ సోమశేఖర్, ఈఓపీఆర్‌డీ రంగయ్య, మండల వైద్యాధికారిణి డాక్టర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి టౌన్: వృద్ధులకు కళ్ల జోడును అందిస్తున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి



సిద్దవటం: ప్రజలకు మందులను అందజేస్తున్న నాయకులు, వైద్యులు, అధికారులు



పెనగలూరు: చిన్న పిల్లలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ దినేష్ రెడ్డి

ఎన్‌సీసీ ఉత్తమ కేడెట్‌గా శరత్



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న శరత్

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థి శరత్ ఎన్‌సీసీ డ్రిల్‌లో ఉత్తమ విద్యార్థి గా ఎంపికయ్యారని ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపులు రాజశేఖర్ తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలో 8వ కంబైన్డ్ వార్షిక శిక్షణా శిబిరంలో నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థులు డ్రిల్, మ్యాప్ రీడింగ్, ఫైరింగ్ మొదలగు వాటిపై శిక్షణ పొందారన్నారు. ఈ శిబిరంలో జూనియర్ డివిజన్ విభాగపు డ్రిల్ పోటీలో చిట్వేలి ఎన్‌సీసీ విద్యార్థి శరత్ ఉత్తమ కేడెట్‌గా ఎంపికయ్యారన్నారు. ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ యోగేష్ దుంగ్రకోటి, క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్ కుమార్ చేతులమీదుగా గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని శరత్ అందుకున్నారని రాజశేఖర్ తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యాయులు దుర్గరాజు, చంద్రయ్య తదితరులు విద్యార్థి శరత్‌ను అభినందించారు.

ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా శివప్రసాద్

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా బీజేపీ ఓబీసీ ఉపాధ్యక్షుడిగా రాయచోటికి చెందిన రేపన శివప్రసాద్‌ను నియమించారు. గురువారం జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ నుంచి ఆమోద పత్రం అందినట్టు శివప్రసాద్ ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మరోమారు జిల్లా ఉపాధ్యక్ష పదవిని ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జి బిట్ర శివనారాయణ, జిల్లా ఇన్‌చార్జి రాజుహౌళిలకు ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ పటిష్టత కోసం, బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

బాల్య వివాహలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



అవగాహనా పోస్టర్‌లను ఆవిష్కరించిన ఆర్డీఓ

రాజంపేట రూరల్ : బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓ జి.రామకృష్ణారెడ్డి ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని సభా భవన్‌లో గురువారం ఆర్‌డీఓ రామకృష్ణారెడ్డి డివిజనల్ స్థాయిలోని అన్ని శాఖల అధికారులతో డీసీపీఓ సుభాష్‌తో కలిసి బాల్య వివాహాల నిషేధ చట్టం – 2006పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాల్య వివాహ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ పరిధిలో చొరవ చూపాలని కోరారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో జీఓ ఎంఎస్ నెంబరు 31, 39ని డివిజన్ పరిధిలో కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికట్టి మన డివిజన్‌ను ఆదర్శంగా నిలపాలని కోరారు. సీఎంపీఓలుగా మండల స్థాయిలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షకులు ఉంటారని తెలియజేశారు. ఈ సమావేశంలో 9 మండలాలకు చెందిన తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలైతే జీవితం చిత్తు

రాజంపేట రూరల్ : మత్తు పదార్థాలకు బానిసలైన వారి జీవితాలు చిత్తవుతాయని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నందవరం అజయ్‌బాబు హితబోధ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. పట్టణ ఎస్ఐ వెంకటరమణ, డాక్టర్ ఎస్.అఖిల్ సుప్రసాద్, న్యాయవాది ఎస్.ముజఫర్ అహమ్మద్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలను వివరించారు. చట్టాలు మత్తు పదార్థాలను సేవించడం, విక్రయించడం నేరంగా పరిగణించం దని గుర్తు చేశారు. అనంతరం ఎస్ఐ వెంకటరమణ, డాక్టర్ అఖిల్ సుప్రసాద్‌లను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

నందలూరు (రాజంపేట) : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ శంకర్ నాయక్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్ఐ శంకర్ నాయక్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై ఏకాగ్రత కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వాటి జోలికి పోకుండా చదువులపై శ్రద్ధ వహించి, విద్యార్థి దశలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సంపదతో కొనలేనిది జ్ఞానమొక్కటే



విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : సంపదతో కొనలేనిది జ్ఞానమొక్కటేనని మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి అన్నారు. గురువారం విద్యార్థులకు మానవ సంబంధాలు, నైతిక విలువలు అనే అంశాలపై మానవత అధ్యక్షుడు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు జన్మనిచ్చేది తల్లిదండ్రులు అయితే విద్యాబుద్ధులతో క్రమశిక్షణ, నైతిక విలువల గురించి నేర్పేది మాత్రం గురువులు మాత్రమేనని చెప్పారు. అలాంటి గురువులను గౌరవించాలని సూచించారు. అనంతరం విజ్ఞానం, నైతిక విలువలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన యు. తపస్వినీ, గుణశేఖర్, యస్.హజీరాలకు బహుమతులు అందజేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



వాహనదారులకు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజంపేట : రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ గుండాల రమణయ్యలు అన్నారు. రాజంపేట – నెల్లూరు రహదారిలో వాహనాల తనిఖీల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు రవాణా చట్టాన్ని అతిక్రమించిన వారికి జరిమానాలు విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు లోబడి వాహనాలను నడపాలన్నారు. ఓవర్‌లోడుతో వాహనాలు నడపరాదన్నారు. వాహనాలకు సంబంధించిన ట్యాక్సులు సకాలంలో చెల్లించాలన్నారు. అతివేగంతో వాహనాన్ని నడపరాదన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధితో స్వర్ణయుగంలా సీఎం జగన్ పాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మహిళకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : అభివృద్ధి, సంక్షేమంతో సీఎం జగన్ పాలన రాష్ట్రంలో స్వర్ణయుగంలా సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని హసనాపురం గ్రామంలోని జింకలగుట్ట హరిజనవాడ, గొల్లపల్లె, గొల్లపల్లె హరిజనవాడ, కట్టక్రింద హరిజనవాడ, రెడ్డివారిపల్లె, హసనాపురం, పప్పిరెడ్డిగారిపల్లె, పప్పిరెడ్డిగారిపల్లె హరిజనవాడ, కొండావాండ్లపల్లె, కొండావాండ్లపల్లె హరిజనవాడలలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరిస్తూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారికి పథకాలు అందేలా అధికారులను ఆయన ఆదేశించారు.

ముస్లింకు 4శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్‌దే

హసనాపురం, రెడ్డివారిపల్లె, పప్పిరెడ్డిగారిపల్లెలో ముస్లిం కుటుంబాలు ఎమ్మెల్యేను అక్కున చేర్చుకొని ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు పలికారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు, జగన్ పాలనలో ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తింపు చేశారన్నారు. మౌజన్లు, ఇమాంలకు గౌరవవేతనాలను అందిస్తున్నారన్నారు. మైనార్టీ సబ్‌ప్లాన్ తదితర ఎన్నో పథకాలను సీఎం జగన్ అందిస్తున్నారంటూ ముస్లిం కుటుంబాలు ఎమ్మెల్యే ఎదుట హర్షం వ్యక్తం చేశారు. అలానే జింకలగుట్ట హరిజనవాడ, గొల్లపల్లె హరిజనవాడ, కట్టక్రింద హరిజనవాడ, పప్పిరెడ్డిగారిపల్లె హరిజనవాడ, కొండావాండ్లపల్లె హరిజనవాడలో ఎమ్మెల్యేను దళిత మహిళలు ఆత్మీయంగా తమ ఇళ్ల వద్దకు ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జి. జనార్దన్‌రెడ్డి, పప్పిరెడ్డి మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు ఆంజనేయులు, అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డి, వెంకటరెడ్డి, రామాంజులు, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, ఎంపీటీసీ రాములమ్మ, సూరం వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, ఆంజనేయులు, సింగల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ నక్కా నారాయణ, చలమారెడ్డి, నాగేంద్రరెడ్డి, పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని హసనాపురంలోని శ్రీ గంగా భవానీ సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేయించారు.

నేడు రైతు భరోసా కేంద్రం ప్రారంభం

మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయితీ సూర్య నారాయణపురం సచివాలయంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాధరెడ్డి, నారాయణ, సర్పంచ్ రఘురామ్, మాజీ సర్పంచ్ సుబ్బయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు.

శానిటేషన్ డ్రైవ్ నేడు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులో నేటి నుంచి వారం రోజులపాటు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నట్లు గురువారం ఈఓ వరప్రసాద్, ఉప సర్పంచ్ తోట శివసాయి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ శానిటేషన్‌కు స్టాఫ్ సరిపోవకపోవడంతో బయట నుంచి లేబర్ వర్కర్లను రప్పించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇల్ల ముందు స్ప్రే చేయడం, పరిసరాలల్లో ఫాగింగ్ చేపట్టడం, దోమలు పెరగకుండా నిలువ ఉన్న నీళ్లను తొలగించడం, సాధారణ పారిశుధ్య నిర్వహణ చర్యలు చేస్తున్నామని తెలిపారు. కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ సంబంధించిన అధికారులు ఈ నెల 15వ తేదీన రైల్వేకోడూరు పంచాయతీని విజిట్ చేస్తారని తెలిపారు. ఐఎస్ఓ సర్టిఫికేషన్ జారీ కోసం పరిశీలించనున్నట్లు తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న మేనేజర్ అరుణ్

నందలూరు (రాజంపేట) : ప్రతి ఒక్కరూ తమ ఇంటివద్ద కనీసం ఒక మొక్కను నాటాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్ ఎస్.అరుణ్ కోరారు. గురువారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని ఎర్రచెరువు కట్టపై వెలసిన శివాలయం వద్ద ఆజాదీ అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆఫీస్ అడ్వైజర్ జస్విందర్, ఆఫీస్ అసిస్టెంట్ శ్రీరామ్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నందలూరు (రాజంపేట) : బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ప్రధానోపాధ్యాయులు స్టాలిన్, ఉపాధ్యాయులు చెన్న కృష్ణమ్మ, రజినీ, కృష్ణారెడ్డి, మోహన్ రాజులను గురువారం ఉదయం టంగుటూరు హెచ్ఎం శ్రీనివాసులు అధ్యక్షతన ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువా, పూలమాల, జ్ఞాపికలతో సత్కరించారు.

ఘనంగా పీడీఎస్‌యూ వార్షికోత్సవం

రామాపురం : ఐదు దశాబ్దాలుగా విద్యార్థి సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ అని ఆర్‌కే రెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ వి.రామకృష్ణారెడ్డి అన్నారు. పీడీఎస్‌యూ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర పాఠశాలలో పీడీఎస్‌యూ జెండాను పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, పాఠశాల కరస్పాండెంట్ శేఖర్‌రెడ్డిలు ఆవిష్కరించారు.

శాంపుల్స్ సేకరణ



రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఊటుకూరు గ్రామం కొండగుట్ట ప్రాంతంలో బుధవారం మృతి చెందిన 9 మేకలకు గురువారం పంచనామా నిర్వహించి 36 అవయవ శాంపిల్స్‌ను సేకరించామని పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ కే భాగ్యవతి తెలియజేశారు. మృతికి గల కారాణాలను వీశ్లేషించేందుకు సంబంధిత రైతుల ద్వారా ప్రయోగశాలకు పంపామన్నారు. ఇదే సమయంలో మిగిలిన మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స చేశామని తెలియజేశారు. ఇదే విషయాన్ని ఉన్నత అధికారులకు నివేదించామని తెలియజేశారు.